క్లుప్తంగా

ఆర్‌డీటీ సేవలను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం చర్యల కారణంగా ఆర్‌డీటీ చేస్తున్న పలు సేవ, స్వచ్ఛంద కార్యక్రమాలు నిలిచిపోయాయని, వెంటనే సేవలను పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు సన్నల సాయిరాంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉందని, వీరికి వచ్చే ఫండ్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా సేవలను కొనసాగించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో శ్రీరాములు, జావేద్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా పదోన్నతి



పార్థసారథి

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.పార్థసారథికి ఎంపీడీఓగా పదోన్నతి కల్పించి సత్యసాయి జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు పీఆర్అండ్ఆర్‌డీ డైరెక్టర్ వీఆర్.క్రిష్ణతేజ జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి అందాయి. దీనిపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రుద్రవరం: మండలంలోని దాసరిపల్లె కాలనీకి చెందిన శ్రీనివాసులు(38) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అక్కడికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కేసీ నరసింహులు, దేవగుడి జాకీర్, ఉసేని, చిన్న నాగన్న, బండారు పెద్దన్న, భాస్కర్, మనోహర్, వెంకట రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా శంకర జయంతి



ఉపనయనం కార్యక్రమంలో పాల్గొన్న వటువులు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనందీశ్వర దేవాలయంలో వెలసిన గాయత్రీ దేవాలయంలో శుక్రవారం బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో శంకర జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముందుగా గాయత్రీమాతకు సుప్రభాతసేవ, ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం శంకరాచార్యుల చిత్రపటానికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం వేద పండితుడు గుండంపాటి రఘురాం శర్మ ఆధ్వర్యంలో వటువులకు సామూహిక ఉపనయనం చేయించారు. సమాఖ్య అధ్యక్షుడు కరణం మురళీ కృష్ణారావు , సుధీంద్రాచార్యులు.నాగరాడోన సుధీర్ పాల్గొన్నారు.

మూగజీవాల దాహం తీర్చేందుకు నీటి తొట్లు



పశు వైద్యశాల ప్రాంగణంలో నిర్మించిన నీటి తొట్టిని పరిశీలిస్తున్న డీడీ

రుద్రవరం: వేసవిలో మూగజీవాల దాహం తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో నీటి తొట్టెలను నిర్మించిందని పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకుడు రమణయ్య తెలిపారు. స్థానిక పశు వైద్యశాలలో నిర్మించిన నీటి తొట్టెను శుక్రవారం పరిశీలించారు. రుద్రవరం మండలంలో మొత్తం 31 తొట్టెలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి రూ.34 వేల ప్రకారం నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆయన వెంట ఎర్రగుడిదిన్నె పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, సిబ్బంది ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

కోవెలకుంట్ల: ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మహిళా పోలీస్ స్టేషన్ సీఐ గౌతమి, కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో మహిళలు, కాలనీ ప్రజలకు సైబర్ నేరాలు, 100, 112, శక్తియాప్, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు వీడియోకాల్స్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసం చేస్తున్నారన్నారు.

మండుతున్న భానుడు

- సూర్యోదయ సమయం నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- 40 – 44 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న వడగాడ్పులు, ఉక్కపోతలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ప్రజలు లేక బోసిపోయిన గోస్పాడు రహదారి

గోస్పాడు: భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. దీంతో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పగటి పూటతో పాటు రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా పెరిగాయి. ఈ ఏడాది ఎండా కాలంలో సైతం ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఒకవైపు వడగాల్పులు, ఉక్కపోతతో పాటు మరోవైపు అకాల వర్షాలు పడటంతో రైతులు పంటలను కాపాడుకోవడానికి అవస్థలు పడుతుండగా, జనం వేడి నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నప్పటికీ మరుసటి రోజు ఉదయం మరింత వేడిగా ఉంటోంది. ఉదయం నుంచే అధిక వేడి ఉంటుండటం, రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరగడంతో ఇళ్లల్లో సెగలు పుడుతున్నాయి. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతల్లో తీవ్ర మార్పులు చోటు చేసుకున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగ మంటూ తన ప్రతాపాన్ని చూపించడంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఒకవేళ బయటకు వెళ్లినా వేడి గాలులకు అల్లాడి పోతున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితం అవ్వడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉక్కపోతలతో వృద్ధులు, చిన్న పిల్లలు మరింత అల్లాడి పోతున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..

జిల్లాలోని పలు మండలాల్లో వారం రోజులుగా 40 డిగ్రీల మొదలు 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా పాణ్యంలో 44 డిగ్రీలు, దొర్నిపాడులో 43.9, మహానందిలో43.6, మిడుతూరు, నందికొట్కూరులలో 43.3, అవుకు, గోస్పాడు, రుద్రవరం, ఆళ్లగడ్డలో 43.4, కొలిమిగుండ్లలో 43.1, గాజులపల్లెలో 42.9, కాగా శిరివెళ్ల, గడివేముల, నంద్యాల, బండిఆత్మకూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, డోన్, బేతంచెర్ల వంటి మండలాలలో 41 డిగ్రీల నుంచి 42 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ అధికారులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎండ తీవ్రంగా ఉంటుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లొద్దు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటికి వెళ్లాలి. గ్రామాల స్థాయి ఆసుపత్రుల నుంచి పట్టణ స్థాయి ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ పాకెట్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం. ఎండ వేడిమికి గురైనట్లు అనిపిస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. మంచినీళ్లు అధికంగా తీసుకోవాలి. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీరు తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. ఒంట్లో నీటి శాతం తగ్గకుండా ఉంటుంది.

– వెంకటరమణ, డీఎంహెచ్ఓ, నంద్యాల

బాల్య వివాహాలతో అనర్థాలు



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

చాగలమర్రి: బాల్య వివాహాలతో మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయని.. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల వారి జీవితం నాశనం అవుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి అన్నారు. స్థానిక సచివాలయం–4 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మద్దూరు ఫీల్డ్ అసిస్టెంట్ సర్టిఫికెట్లపై విచారణ

పాణ్యం : మద్దూరు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న డి.బాబు ఉన్నతాధికారులకు సమర్పించిన పదో తరగతి సర్టిఫికెట్లపై ఫిర్యాదు రావడంతో విచారణ చేపడుతున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ విద్యాభ్యాసానికి సంబంధించి పలు ఫిర్యాదు అందడంతో వీటిపై విచారణ చేసి నివేదిక అందించేందుకు అధికారులను నియమించామన్నారు.

నంద్యాల యువ రచయితకు కన్నడ పట్టా



హెఓడీ నుంచి పట్టా అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల పట్టణానికి చెందిన యువ రచయిత పి.రామకృష్ణారెడ్డి మైసూరులోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సీఐఐఎల్) నుంచి లింగ్విస్టిక్‌లో శుక్రవారం కన్నడ హెచ్‌ఓడీ వి.జయలక్ష్మి నుంచి కన్నడ పట్టా పొందినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు లిట్ చేసిన తాను స్వతహాగా రచయిత అవ్వడం వల్ల ఇతర భాషల అధ్యయనం చేయడం వల్ల భాషా పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం తాను తమిళం నేర్చుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ఏప్రిల్ 2న పురుగుమందు సేవించిన క్రిష్ణయ్య



చిన్ని క్రిష్ణయ్య (ఫైల్)



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అవుకు: ఆత్మహత్యకు యత్నించిన ఏఆర్ కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. అవుకు పట్టణానికి చెందిన సుంకేసుల చిన్న క్రిష్ణయ్య(35) నంద్యాలలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. ఉద్యోగ రీత్యా నంద్యాల టౌన్‌లోని బాలజీ కాంప్లెక్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో విసిగిపోయాడు. దీంతో ఏప్రిల్ 2వ తేదీ నంద్యాలలోని చిన్న చెరువు సమీపంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి శాంతిరాం ఆస్పత్రికి అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామమైన అవుకుకు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. నంద్యాల జిల్లా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ యాదవ్, ఆర్ఎస్ఐ దాదాపీరా, స్థానిక ఎస్ఐ రాజారెడ్డి పోలీసు శాఖ తరుపున రూ.2లక్షలను కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమారుడు కీర్తదేవ్, ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని ఇటిక్యాల రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డులో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటిక్యాలకు చెందిన ఏసురత్నం పని నిమిత్తం కారులో కొలిమిగుండ్లకు వచ్చి తిరుగు పయనమయ్యాడు. అదే సమయంలో తాడిపత్రి నుంచి వస్తున్న లారీ కస్తూర్బా సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ఏసురత్నం తీవ్రంగా గాయపడ్డాడు. నారాయణస్వామి అనే వ్యక్తి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. క్షతగాత్రున్ని కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మహిళల ఉజ్వల భవితకు ‘కిశోరి వికాసం’



అవగాహన కల్పిస్తున్న అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న కిశోర బాలికలు, మహిళలు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: బాలికలు, మహిళల ఉజ్వల భవితకు కిశోరి వివాసం కార్యక్రమం ఎంతో ఉపయుక్తమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ అన్నారు. స్త్రీ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 39 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, లైంగిక హింస, టీనేజ్ ప్రెగ్నెన్సీ లాంటి అనేక సమస్యలు బాలికలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఇలాంటి సమస్యలు లేకుండా చేయాలంటే.. కిశోరి వికాస గ్రూపులను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రుద్రవరం: చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండల పరిధిలోని చిన్నకంబలూరు ప్రభుత్వ పాఠశాలలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంగా ఉండేందుకు పాలు, గుడ్లు, తృణ ధాన్యాలు వంటి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల హక్కులపై తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలికలు, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు.

గోస్పాడు: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య అవసరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూన్ 10వ తేదీ వరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కిశోరి వికాసం – వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరుపనున్నటు చెప్పారు.

దిగి వచ్చిన క్యారెట్



కూరగాయలు

నంద్యాల(న్యూటౌన్): ఎండ మండిపోతున్నా.. కూరగాయల ధరలు కాసింత చల్లగానే ఉన్నాయి. ధరలు అందుబాటులో ఉండటంతో సామాన్యుడికి నాలుగు మెతుకులు తినగలుగుతున్నారు.

మొన్నటి వరకు కొండెక్కిన క్యారెట్ ధర ప్రస్తుతం దిగొచ్చింది. అల్లం ఘాటు తగ్గింది. కూరగాయల ధరలు సామాన్యులకు కాసింత ఉపశమనం ఇస్తున్నాయి. మొన్నటి వరకు కిలో వందకు పైనే పలికిన క్యారెట్ ధర ప్రస్తుతం కిలో రూ.25కి చేరింది. అల్లం ధర రూ.200కు పైగా ఉండగా.. నేడు కిలో రూ.70 ప్రకారం విక్రయిస్తున్నారు. ఇక క్యాబేజీ, బీట్‌రూట్, వంకాయలు కిలో రూ.30కి చేరుకున్నాయి. దొండకాయ, బెండకాయ కిలో రూ.25 ఉన్నాయి. కాకరకాయ, మట్టికాయి, క్యాలీఫ్లవర్ కిలో రూ.30 ఉండగా మిగత దోసకాయ, బంగాళదుంప, బీరకాయలు కిలో రూ.35 పలుకుతున్నాయి. ముల్లంగి, మిరపకాయలు కిలో రూ.40, చిక్కుడు, అనపకాయలు, క్యాప్సికం ధర కిలో రూ.50 ఉంది. వేసవిలో కూరగాయల ధరలు తగ్గడంతో వినియోగదారులు కాస్త ఊరట చెందుతున్నారు.

భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు

ఉయ్యాలవాడ: భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని.. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల్లోని 1122 మంది రైతులకు చెందిన పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 53 మంది రైతులకు సంబంధించి మట్టి నమూనాలు సేకరించినట్లు వెల్లడించారు. మట్టి నమూనాల సేకరణ పూర్తయిన తరువాత పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. ల్యాబ్ నుంచి ఫలితాలు రాగానే రైతులకు అందజేస్తామని స్పష్టం చేశారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

చాగలమర్రి: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని ఫోరం జిల్లా కన్వీనర్ డెన్నీ జాన్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ కార్యచరణలో భాగంగా మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు పోస్ట్‌కార్డుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి తమ సమస్యలను తెలియజేస్తామన్నారు. మే రెండో వారం నుంచి ప్రతి జిల్లా కేంద్రంలో ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు



ఇంట్లో చెలరేగుతున్న మంటలు

రుద్రవరం: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంలో విశ్వం పూజారికి చెందిన ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పూజారి మొదటి అంతస్తులో విద్యుత్ ఇస్త్రీ పెట్టె ద్వారా బట్టలను ఇస్త్రీ చేస్తుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే ఆ ఇస్త్రీ పెట్టెను అలాగే వదిలేసి కిందికి వచ్చాడు. కాసేపటికి తిరిగి విద్యుత్ సరఫరా వచ్చింది. అయితే అది పట్టించుకోకుండా ఆయన కింది ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నారు. ఇంతలో ఇస్త్రీ పెట్టె అధికంగా వేడెక్కి పక్కనే ఉన్న దుస్తులు అంటుకొని మంటలు చెలరేగాయి. ఆలస్యంగా గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయితే దట్టమైన పొగ కారణంగా పలికి ఎవరూ వెళ్లలేకపోయారు. ప్రమాదంలో సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

నాటు సారా స్వాధీనం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని నారాయణాపురం గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన 10 లీటర్ల నాటు సారాను శుక్రవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన ముర్తుజావలి కొంత కాలంగా గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వేలంలో ఆలయానికి ఆదాయం

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి చెందిన భూములు కౌలు హక్కుల కోసం శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలంలో రూ.1.03 లక్షలు ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. కొన్ని సర్వేనంబర్లకు వేలం పాట వాయిదా పడినట్లు పేర్కొన్నారు. అలాగే తలనీలాలు, చెప్పుల స్టాండ్ నిర్వహణకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరగాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమాన్

గోస్పాడు: అధికారులు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల వారీగా అధికారులు అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. ప్రభుత్వం మద్దతు ధరకు జొన్నలను కొనుగోలు కేంద్రాల ద్వారా సక్రమంగా కొనుగోలు చేయటం లేదని, సంచులు కూడా ఒక వర్గానికే అందిస్తుండడంతో రైతులందరికి న్యాయం జరగటంలేదని ఎం.క్రిష్టాపురం సర్పంచు కోటేశ్వరరెడ్డి ప్రశ్నించారు. వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి సమాధానం ఇస్తూ రైతులందరికి సంచులు అందజేస్తామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. కూలీలకు ఉపాధి పనుల కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ కేవలం ఒక వర్గానికే పనులు కల్పించడంపై సాంబవరం సర్పంచు ఐజయ్య నిలదీశారు. ఉపాధి ఏపీఓ గంగన్న స్పందిస్తూ వచ్చే వారం నుంచి కూలీలందరికి పనులు కల్పిస్తామని చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నాయని గ్రామాలలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అలాగే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. స్టేజీల్లో ఆర్టీసీ బస్సులను సక్రమంగా నిలుపటం లేదని విద్యార్థులు, వృద్ధులు వెళ్లే బస్సులను ఎక్కేందుకు అవస్థలు పడుతున్నారని ఎంపీపీ సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశానికి ఆర్అండ్‌బీ, కేసీకెనాల్, పోలీసు శాఖల అధికారులు సమావేశానికి రాలేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. వైస్ ఎంపీపీలు జనార్దన్‌రెడ్డి, రాజు, ఈఓఆర్డీ నాగఅనసూయ, ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఏఈలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆది శంకరాచార్యులు, పంచగురువుల చిత్రపటాలకు పూజలు

చాగలమర్రి: మండల కేంద్రంలోని పాత శివాలయంలో వేదాంతగీత, శివం ఫౌండేషన్ అధ్యక్షులు అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచగురు పాదుక పూజలో భాగంగా దక్షిణామూర్తి, దత్తాత్రేయులు, శ్రీకృష్ణ, వేద వ్యాసులు, ఆది శంకరులకు108 మంది మహిళలతో 10,108 పూష్పాలతో అర్చన చేశారు. నంద్యాల, ప్రొద్దుటూరుకు చెందిన ప్రవచనకర్తలు క్రిష్టారెడ్డి, వీరభద్రయ్య, శాంతానందస్వామి భగవద్గీత, ఆత్మజ్ఞానం, భక్తి తదితర అంశాల సారాంశాన్ని భక్తులకు వివరించారు. భక్తులకు ప్రసాదాలు, గురు దక్షిణామూర్తి క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఆలయ పాలక వర్గం అధ్యక్షుడు వీరంరెడ్డి భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం



మద్దిలేటి నరసింహస్వామికి తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్య సమర్పణ, హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

వదలని వర్షం.. తడిసిన ధాన్యం

- లబోదిబోమంటున్న రైతన్నలు



బీరవోలు సమీపంలో తడిసిన వరి ధాన్యం

రుద్రవరం: మండలంలో మూడు రోజులుగా ఈదురు గాలులతో వర్షం కురుస్తోంది. దీంతో కోత దశలో ఉన్న వరి, ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దగా మారుతుండడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. శుక్రవారం సాయంత్రం రుద్రవరంతో పాటు ఎల్లావత్తుల, బీరవోలు, శ్రీరంగాపురం, డీ కొట్టాల, పెద్దకంబలూరు, అప్పనపల్లె, మాచినేనిపల్లె, చందలూరు తదితర గ్రామాల పరిధిలో భారీగా గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలవాలింది. వాలిన వరి కోతలు సాగించాలంటే అదనపు ఖర్చులు అవుతాయని, ధాన్యం నేలరాలి తక్కువ దిగుబడులు చేతికందుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇది వరకే కోతలు కోయించి వచ్చిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో ఇలా వర్షం కురిసి ధాన్యం తడవడంతో వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారని ఆందోళన చెందుతున్నారు.



పెద్దకంబలూరు వద్ద నేలవాలిన వరి పైరు